

# మా తుఝే సలామ్

జీవితం నిర్వేదానికి లోనైనప్పుడు, నిష్పాక్షికంగా ఆలోచించడం మొదలెడుతుందట -

భార్య శ్రీవాణి దూరమైన కొత్తలో ఎంతో తల్లడిల్లిపోయాడు హరీశ్. ప్రకృతి వినా పురుషుడు లేడన్నట్లు శ్రీ లేకుండా తను బతకలేడన్నంతగా ఆమెతో అనుబంధాన్ని పెనవేసుకున్నాడు. వాళ్ళది ప్రేమ వివాహం కాకపోయినా, ప్రేమికులు అసూయపడేంత అన్యోన్య దాంపత్యం. ఆలోచనల్లో, అలవాట్లలో, భావుకతలో, శైలిలో ఇద్దరిలో వైవిధ్యమున్నా, ఒకరినొకరు అర్థం చేసుకుని గౌరవించుకుంటూ సర్దుకుపోవడం మొదలెట్టారు. అది మొదట్లో ఇబ్బందికరంగా అనిపించినా, క్రమేపీ ఇష్టంగా మారింది. ఆ ఇష్టం పరస్పరాభిమానాన్ని పెంచింది. అది వాళ్ళ అనురాగలత నిత్యం పల్లవించేలా చేసింది.

అతడు అల్లరి ప్రేమికుడు - ఆమె సంగీత ప్రియ, అతను వాగుడు కాయ - ఆమె మౌనగీతిక, అతడు ఆధునికతకు ప్రతినిధి - ఆమె సంప్రదాయ ప్రోవు, అతను పోరాటపు అభిమాని - ఆమె సర్దుబాటు సౌమ్య, ఆయనకు ఉద్యోగమే కాలక్షేపం - ఆమెకు సౌందర్యారాధన అభినివేషం.

భిన్నధృవాల మధ్య అయస్కాంత ధర్మంలా వారిరువురి మధ్య ప్రేమ బలీయమైంది. ఒకరు ఎగసిపడితే మరొకరు అణిగిపోయే వాతావరణం ఆ గృహసీమను స్వర్గసీమను చేసింది. కాని, అతి మాధుర్యం ఏవగింపుకి సంకేతమన్నట్లు ఆ బంధం అనతికాలంలోనే

వీగిపోయింది. కారణం - 'వరిగింజలో బియ్యంగింజ'. ఆమె 'కాలేజీ రోజుల్లోని బాయ్‌ఫ్రెండ్'ని గురించిన ప్రస్తావన వాళ్ళ 'కడివెడు పాల' దాంపత్యంలో 'గచ్చకాయంత పెండకచ్చిక'గా మారింది.

పురుషాధిక్యాన్ని పుణికి పుచ్చుకున్న హరీశ్ కిందికి దిగలేదు. ఆత్మాభిమానమే ఆభరణమనుకున్న శ్రీవాణి బెట్టు సడలలేదు. కోర్టునాశ్రయించ కుండా, పెద్దలమాట వినకుండా పంతానికి పోయి జీవితాన్ని మరింత దుర్భరం చేసుకున్నారు. తెలిసిన మూర్ఖుల్ని మార్చలేమన్న నిజాన్ని గ్రహించిన పెద్దలు సమస్యను కాలమనే న్యాయస్థానానికి నివేదించి నిట్టూర్చేశారు.

శ్రీవాణికి ఆమె చదువు ఓ ఆధారాన్ని చూపించడంతో మరోరకం సర్దు'బాట' కలవాటుపడిపోయింది. పోరాటానికలవాటుపడ్డ హరి జీవితాన్ని ఒంటరిపోరాటంగా స్వీకరించేందుకు సిద్ధపడ్డాడు. వానాకాలం మబ్బుల్లా ఇద్దరి హృదయాల్లో వైరాగ్యమేఘాలు ఆవరించసాగాయి.

ఆరోజెందుకో కాఫీ రుచించలేదు హరికి. టిఫిన్ చేసుకునేందుకు మనస్కరించలేదు. స్నానానికీ బద్ధకించాడు. టి.వి. మాత్రం తన మానాన తను అతని ఒంటరితనం పోగొట్టే ప్రయత్నాన్ని ఎప్పటిలాగే నెరవేరుస్తోంది. న్యూస్ ఛానెల్ చెప్పిన వార్తల్నే మళ్ళీ మళ్ళీ యాడ్స్ మార్చి చెబుతోంది.

హరీశ్ మెదడు నిండా ఆలోచనలు జుంటి తేనీగల్లా ముసురుకొని అతని జీవనక్రియల్ని సైతం శాసించేలా ఎదుగుతున్నాయి, అతనికి తెలియకుండానే....

'గోద్రా సంఘటనకు కారకులెవరు ? గుజరాత్‌లో అల్లర్లెటుపోతున్నాయి? అక్షరధామం ఘోరకృత్యానికి దారితీసిన పరిస్థితులేవి ? స్థూలదృష్టికి ఇవన్నీ ఒకదానితో ఒకటి సంబంధమున్నట్టు తోచినా, ఏదో బలీయమైన శక్తి ఈ నేపధ్యంలో వికటాట్టహాసం చేస్తున్న సంగతి లీలగా గోచరిస్తోంది. ఎందుకిలా జరుగుతోంది......?"

'విశ్వజననిగా, శాంతి దూతగా, భిన్న సాంస్కృతిక దిక్సూచిగా, విశ్వమానవ సౌభ్రాతృత్వ సౌమ్యశీలగా ప్రపంచ ప్రజల మన్ననలందుకుంటున్న ఈ దేశం ఏమైపోతుంది ? పార్థీనియం గడ్డిలా సమాజం నాలుగు చెరగులా వ్యాపిస్తున్న విషసంస్కృతి స్వార్థం గుఱ్ఱంమీద దౌడు తీస్తూ కల్మషాల దారుల వెంట ఎటు పయనిస్తోంది......?'

ఆలోచిస్తూనే యాంత్రికంగా షేవింగ్‌కి ఉపక్రమించాడు హరి.

'నమ్ముకున్న రాజకీయ నాయకులు, నమ్మకమైన పత్రికారంగం, ప్రబలమైన ప్రచార సాధనాలు సైతం ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు పూనుకుంటున్నాయి. ప్రతిచోటా ఆధిక్యతా పోరాటతత్త్వం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ప్రయత్నంలో అవకతవకలు, అన్యాయాలు, అక్రమాలు, దేశద్రోహ చర్యలు...'

'మన న్యాయ వ్యవస్థ, చట్టంలోని లోపాలూ, నేరగాళ్ళ కొమ్ము కాసేందుకు సహకరిస్తున్నాయి. గుప్తుల కాలంలో దేశద్రోహానికి బహిరంగ శూలారోహ శిక్ష విధించే వారట (దేశద్రోహిని ప్రజాసమక్షంలో అత్యంత పదునైన శూలంపైకెక్కించి, వారి పురీషం నుండి తలను చీల్చుకుపోయేలా చేసేవారు). మరి ఇప్పుడో శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాల్లా ఎంతటి నేరస్థులైనా అర్థబలంతో బయటపడే వ్యవస్థలు....'

హరి ఆలోచనలకు ఆజ్యం పోస్తూ టీవీలో మరో పేలుడు, ఆర్తనాదాలు, హాహాకారాలు, వేదనలు, రోదనలు, ప్రతీకార ప్రకంపనలు, రాజకీయ నాయకుల విసుర్లు, ఇంటర్వ్యూలు.....

అప్పుడు గుర్తుకొచ్చింది హరికి. ఆ ఉదయమే జిల్లా టాబ్లాయిడ్‌లో చదివిన వార్త. తమ పట్టణంలో కూడా కాశ్మీర్ తీవ్రవాదులు సంచరిస్తున్నట్టు, పోలీసులు అనుమానిస్తున్నారని. ఇప్పటికీ తను నమ్మలేకపోతున్నాడది. అదెంత నిజమో ?! 'అదిగో పులి అంటే ఇదిగో తోక' అనడం వార్త లక్షణం. కాని 'నిప్పులేందే పొగరాదనుకోవడమూ' ఈ సందర్భంలో ఆలోచింపదగిందే.

టెర్రరిస్టులంటే రాక్షసుల్లా కొమ్ములూ కోరలుంటాయా ? వెంటనే గుర్తించడానికి. వాళ్ళే నయం, చీడపురుగుల్లా అట్టే దొరికిపోయేవారు. వీళ్ళు వేరు పురుగులు. కొమ్ములూ కోరలూ కడుపులో దాచుకుని వాళ్ళకంటే రాక్షసంగా కాటేయగలవారు. వాళ్ళ నాయకుడిని విడిపించుకునేందుకు ఏ రకమైన ఎత్తులు వేస్తున్నారో ?! నిజంగా తమ పట్నంలోకి వచ్చి ఉంటారా ?

నిన్నటికి నిన్న చెచెన్యా దళం సినిమా థియేటర్‌ను లక్ష్యంగా పెట్టుకోలేదా? కాదేదీ టార్గెట్ కనర్హం...మొన్న రైలు, నిన్న దేవాలయం, ఈ రోజు బడీ వాళ్ళ 'లక్ష్య' సాధనకు కేంద్రంగా చేసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. పోనీ ఒకవేళ అలా వచ్చారే అనుకుంటే....ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండటం అవసరం. పట్టణాల్లో కూడా ఇలాంటి సంఘటనలప్పుడప్పుడూ జరుగుతూనే ఉన్నాయి కూడా. ఒక స్త్రీ తన భర్తను, కూతుర్నీ పోగొట్టుకుని ఏడుస్తూ....

ఆ కంఠస్వరం హరిని కదిలించింది. 'ఎక్కడో విన్నట్టుందే...'అనుకుంటూ రక్కున టీవీపై దృష్టి కేంద్రీకరించాడు. 'ఎస్ ! అది శ్రీ గొంతులా ఉంది. రూపం కూడా ఆమెకు దగ్గరగా ఉంది. కాని ఆమె కాదు.' నిట్టూరుస్తూ మళ్ళీ పనిలో పడ్డాడు. ఈసారి ఆలోచనలు శ్రీ చుట్టూ తిరగసాగాయి, చాలా రోజుల తర్వాత.

'ఛ ! మానవ జీవితం ఇంత క్షణికమైందా ? ఈ క్షణికమైన జీవితం కోసం ఎన్ని వైషమ్యాలు, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, హత్యలు, బీభత్సాలు, ఆవేశాలు, ఆవేదనలు...'

'ఛ !  నాగురించి నేనాలోచించలేనివాడ్ని, ఇక దేశాన్ని గురించి ఏమాలోచించ గలను ?' అలా అనుకోవడం గుండెలోని మారుమూలలో గుచ్చుకున్న భావన కలిగించింది అతనిలో.

'ఏది దేశభక్తి, ఏది సంస్కృతి, ఏది క్రమశిక్షణ - అంటూ నిరంతరం ప్రశ్నల పరంపరలో కొట్టుకొని పోవడం కంటే నియమబద్ధమైన జీవనాన్ని అలవరుచుకొని, మనచుట్టూ ఉన్నవారికి చేతనైన సాయం చేయడంలోనే దేశభక్తి ఉంది. 'పరోపకార పుణ్యాయ, పాపాయ పరపీడనమ్.... పాపాయ పరపీడనమ్ ...పరపీడనమ్ ....'

అప్పుడు గుర్తొచ్చింది హరికి, 'శ్రీని పీడించడం మాత్రం పాపం కాదూ!' వెంటనే ఓ నిర్ణయానికొచ్చాడు.

చకచకా శారదా విద్యామందిరానికి నెంబర్ డయల్‌చేశాడు.
శ్రీవాణి పనిచేస్తూందక్కడే.

ఎంగేజ్ వస్తూంది, మళ్ళీ ఆర్ నొక్కాడు... ఎంగేజ్,  ఎగెయిన్ రీ డయల్... సేమ్ రిజల్ట్.

'ఇంక లాభంలేదు !' అనుకుంటూ షేవింగ్ పూర్తికానిచ్చి, బాత్రూంలో దూరాడు. ఒంటిమీద ఒక్క మగ్గు నీళ్ళు పోసుకోగానే ఫోన్ రింగయ్యింది. 'ఎవ్వరిదో !  శ్రీది కాదుగదా ?'  తన ఆలోచనకు తనకే నవ్వొచ్చింది.  అంతలోనే 'సెల్ ఫోనుంటే ఈ సమయంలో బావుండేది కదా !'  అన్న ఆలోచన వచ్చింది.  రకరకాల ఆలోచనల మధ్య స్నానమనే ఫార్మాలిటీ ముగిసింది.  స్నానం పూర్తయ్యేంత సేపూ ఫోనలా పదే పదే మోగుతూనే ఉందన్న సంగతి అతడు సరిగ్గా పట్టించుకోలేదు.  శ్రీని కలుసుకోవడం తప్ప మరో ఊహే అతని అంతరంగపు ఛాయల్లోకి రావడం లేదు.  క్షణక్షణానికీ భార్యపట్ల అభిమానమూ, తన తప్పిదమూ వామనుని విశ్వరూపాన్ని తలపించాయి.

గబగబా తయారై డోర్ లాక్ చేయబోతూ, మరోసారి స్కూల్‌కి ఫోన్‌చేస్తే బావుంటుదన్న ఆలోచన రాగానే తాళం కప్ప కొక్కికి తగిలించి వచ్చి రీ-డయల్ నొక్కాడు. లక్కీగా కలిసింది.

అవతల రిసీవర్ ఎత్తినట్టు తెలియగానే రెస్పాన్స్‌ని పట్టించుకోకుండా - "మిసెస్ శ్రీవాణిని పిలుస్తారా ?" అన్నాడు ఆదుర్దాగా.

"మీరు......"

"నేను వాళ్ళ హజ్బెండ్ హరీశ్‌ని మాట్లాడుతున్నాను." అతని గొంతు వణికింది - అది ఉద్వేగమో, సంకోచమో.... మరేమో !

"........" సమాధానం గాని, రిసీవర్ పక్కన బెదుతున్న శబ్దంగానీ లేదు.

"హలో.... హలో...... హలో......"

"........."

మళ్ళీ పిలవబోయాడు. అప్పుడు వినిపించింది అస్పష్టంగా సన్నని రోదన. అతని బొమ్మలు ముడిపడ్డాయి.

"ఏ..వం..డీ !" వెక్కిళ్ళ మధ్య ప్రయత్నం మీద వినిపించిన శబ్దం.

"అది...అది... తన శ్రీ గొంతే ...ఎస్." ఉద్వేగంతో ఒక్క క్షణం అవాక్కయ్యాడు. "శ్రీ....శ్రీ....శ్రీ...." బలవంతంగా గొంతు పెగల్చుకున్నాడు. కన్నీళ్ళాగడంలేదు.

అగ్నిపర్వతం బద్దలైనట్లు ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది. తనున్నది ప్రిన్సిపాల్ ఛాంబర్‌లోనని, తనో టీచర్‌నని, తోటి వాళ్ళొకరిద్దరు తనని గమనిస్తున్నారనీ గ్రహించేస్థితిలో లేదామె. తనను తాను నిగ్రహించుకోలేక భోరుమంది.

మరోపక్క కనీళ్ళమధ్య....కలవరిస్తునట్టు ఆమె పేరునే జపిస్తున్నాడు ఉద్వేగంగా.

పరిస్థితి గమనించిన ప్రిన్సిపాల్ చప్పున ఫోనందుకుంది. "ఎవరూ ! హరీశ్ గారేనా ? శ్రీవాణి అరగంట నుండీ మీ ఫోన్‌కోసం ట్రై చేస్తోంది. ముందు ఎంగేజ్ వచ్చింది. తర్వాత ఎవరూ లిఫ్ట్ చేయలేదు. సడన్‌గా మీరే ఫోన్‌చేసేసరికి ఎక్సయిట్ అయింది...."

ప్రిప్సిపాల్ చేతిలోనుండి రిసీవర్ అందుకొని తడబడుతున్న మాటలతో అంది, కళ్ళు తుడుచుకుంటూ, "ఏవండీ..... ఒక్కసారి ఇక్కడికొస్తారా !"

"....." ఎన్నాళైంది ఆ గొంతు విని. నా శ్రీ గొంతు విని....

"ఏ...వం....డీ !" అతని మౌనం ఆమెలో ఎన్నో అనుమానాలకు తెరలేస్తోంది.

"ఎస్. శ్రీ ! అయామ్ కమింగ్ !"

వెంటనే ఫోన్ క్రెడిల్ చేసి వేగంగా డోర్ లాక్ చేసి, అంతకంటే వేగంగా తన హీరోహోండా స్టార్ట్‌చేసి వేగానికి ప్రతిరూపంగా బయలుదేరాడు. తమ మధ్యనున్న కాలాన్ని ఓడించేందుకే సిద్ధపడ్డాడతను.

'అది స్కూలయినా, పబ్లిక్ ప్లేసయినా, చివరకు నడిరోడ్డయినా సరే, శ్రీ కనపడగానే తన కౌగిట జేర్చుకొని, ముద్దులతో ముంచెయ్యాలి. క్షమించమని నిర్మొహమాటంగా అడిగెయ్యాలి. ఇనాళ్ళ కల్మషమంతా కడిగెయ్యాలి......" గాలి ఉధృతికి కన్నీళ్ళెగిరి ముత్యాల్లా దూరంగా పడిపోతున్నాయ్.

"కీ.......చు"మంటూ ఆగిపోయింది బండి. సడెన్‌బ్రేకుతో కంట్రోల్‌కాక గిర్రున తిరిగింది. తృటిలో యాక్సిడెంట్ తప్పింది. అప్పుడు గమనించాడు, తను స్కూల్ టర్నింగ్ దగ్గరికొచ్చేశాడని. కాని, రోడ్డేమిటి ఇంత రద్దీగా, హడావుడిగా ఉంది ?

ఆలోచిస్తూ, మళ్ళీ బైక్ స్టార్ట్ చేసి స్లోగా జనాన్ని తప్పించుకుంటూ, వేగానికీ ఉద్వేగానికీ నడుమ కొట్టుమిట్టాడుతూ స్కూల్‌గేట్ చేరుకున్నాడు.

గేట్ మూసేసి ఉంది. లోపల పిల్లలు గోలగోలగా అరుస్తున్నారు. అంతా గగ్గోలు. బయట ఏరియా అంతా నిర్మానుష్యంగా మారింది చూస్తుండగానే.

"ఏవండీ.....! మీరు రావద్దు.....! వెనక్కెళ్ళి పొండి...... ఏవం......" ఫస్ట్‌ఫ్లోర్ కిటికీలోనుండి అరుస్తున్న శ్రీవాణిని గమనించేలోపే ఆమెనెవరో లోపలికి లాగి కిటికీ మూసేశారు.

రక్తం కుతకుతా ఉడికిపోయింది. హరీశ్‌కి. ఆ బిల్డింగ్‌ని గురించి పూర్తి అవగాహన ఉంది అతనికి. క్షణాల్లో అతని మెదడులో ఓ ప్లాన్ రూపుదిద్దుకున్నది.

ఒకే కిక్‌తో బండి మళ్ళీ స్టార్టయ్యింది. మరుక్షణం ముందుకు దూకింది. సరిగ్గా అప్పుడే ఓ బుల్లెట్ వెనుక నుండి సర్రున దూసుకొని వచ్చి, హరి ఎడమ తొడను రాసుకుంటూ ఆయిల్ ట్యాంక్‌ను బద్దలు చేసింది.

అంతదూరం ఎగిరి పడ్డాడు హరి. మరుక్షణం హీరోహోండా పేలిపోయి శకలాలు మూడు వందల మీటర్లదాకా ఎగిరిపడ్డాయి.

అంతసేపూ దూరంగా తచ్చాడుతూ గమనిస్తున్న వాళ్ళు కూడా ఇప్పుడు ప్రాణాలు కాపాడుకోవడమే పరమలక్ష్యమనే సత్యాన్ని గ్రహించి, పిక్కబలాన్ని పరీక్షించుకోవడంలో లీనమైపోయారు.

అది పేరుకే మండల కేంద్రం. జనసాంద్రతకు కొరతలేదు. సౌకర్యాలకు దిక్కులేదు. పోలీస్‌స్టేషన్ అధికారుల అలసత్వానికి ప్రతినిధి. ఇక్కడి పరిస్థితిని గూర్చి వాళ్ళు జిల్లా యంత్రాంగంతో చర్చించేందుకు ప్రయత్నాలు ప్రారంభించే ఏర్పాట్లు చేసుకుంటున్నారు బద్ధకంగా. వాళ్ళ పిల్లలెవరూ ఆ స్కూల్లో చదవట్లేనట్టుంది మరి. ఖచ్చితంగా జరగాల్సిందంతా జరిగింతర్వాత గానీ వాళ్ళు సీన్‌లోకి ఎంటర్ కారు సినిమాల్లోలాగానే.

పక్కనున్న కాంపౌండ్ వాల్‌కి బలంగా గుద్దుకొని పడిపోయిన హరీశ్ బాధని లెక్కచేయకుండా నెమ్మదిగా లేచాడు. సహకరించని ఎడమతొడని నొక్కిపట్టి, పంటిబిగువున బాధనణచుకుంటూ తన ఆలోచనకు ఆచరణకు రూపాన్నిస్తూ పరుగునందుకున్నాడు.

చుట్టూ తిరిగి స్కూల్ వెనకవైపుకి చేరడానికి రెండు ఫర్లాంగులు. ప్రయత్నిస్తే తను రెండు నిముషాల్లో చేరకపోడు. ఆపై ఎకరం మేర దట్టంగా పరుచుకున్న సర్కారు తుమ్మ పొదల్లో నుండి దూరి రావడానికే ఎక్కువ సమయం పట్టొచ్చు.

తుమ్మపొదల మధ్య నుండి రావడం చాలా కష్టంగా ఉంది అతనికి. ఒళ్ళంతా ముళ్ళు గీసుకుపోతున్నాయి. తొడ గాయం నుండి రక్తస్రావం పెరిగింది. కర్చీఫ్ తీసి గట్టిగా కట్టుకున్నాడు. నాలుగడుగులు ముందుకెళ్తే స్కూల్ వెనుక డ్రైనేజీ పైపునందుకోవచ్చు.

కాని, సడన్‌గా అతని వెన్నుముకలో వణుకొచ్చేసింది. గోడ చివర ఓ ఆగంతకుడి నీడ లీలగా కదిలింది.

ఏం జరుగుతుందో ఊహించేసరికి ఆలస్యమైంది. ఆ ఆకారం దబ్బుమని హరిపైన బడి చుట్టేసింది. చాలా బరువుగా కొండచిలువలా హరిని చుట్టేశాడు వాడు. క్షణక్షణానికి బలహీనమైపోతున్న భావన హరిలో. 'ఛ ! జీవితం ఇంత దయనీయంగా అంతం కానుందా ?" అనుకుంటున్న క్షణంలో వాని పట్టు సడలింది.

"సారీ ! కంగారు పడకండి ! నేను మిత్రుడ్నే...." గుసగుసగా అన్నాడు.

అప్పుడు చూసుకున్నారిద్దరు పరస్పరం. ఒకరినొకరు గుర్తించారు. అతడెవరోకాదు. రషీద్. వెటర్నరీ హాస్పిటల్లో అటెండర్. స్వయం సేవకుడుగా సంఘస్థాన్‌లో పరిచయం - వాళ్ళకి.

మాట్లాడొద్దన్నట్టు తర్జని చూపించాడు రషీద్. చకచకా తన ప్లాన్ చెప్పాడు - "ఒక్కడ్నే ఎలా చేయాలా అని ఆలోచిస్తున్నా. భరతమాతే నిన్ను పంపించింది సోదరా ! మనం ఏమాత్రం ఆలస్యం చేసినా వాళ్ళు మనల్ని పసిగడ్తారు. నిన్నరాత్రి మసీదులో నుండే వీళ్ళ కదలికలు అనుమానాన్ని కల్గించాయి. అప్పటినుంచే ఫాలో అవుతున్నాను. ఇద్దరే ఉన్నారు. మనమూ ఇద్దరం కాబట్టి భయంలేదు. మనమే సక్సెస్ అవుతాం. సాధ్యమైనంత ఫాస్ట్‌గా పని పూర్తి చేయాలి.

సడెన్‌గా రషీద్ చూపు హరీశ్ తొడమీద పడింది. "అరె, చాలా రక్తం పోతోందే" అంటూ తన వెడల్పైన కర్చీఫ్ రెండు మడతలు చేసి మునుపటి కట్టుపై నుండే గట్టిగా బిగించాడు.

"భయపడకు మరో 5 నిముషాల్లో పనిపూర్తవుతుంది. ప్రిన్సిపాల్ రూంలో ఒకడున్నాడు. మరొకడు గేట్ వద్ద ఉన్నాడు. వాళ్ళ వద్ద ఎన్ని ఆయుధాలు న్నాయనేది మనకనవసరం."

"డ్రైనేజి పైపుల సాయంతో ఫస్ట్‌ఫ్లోర్ బాల్కానీలోకి చేరుకోవాలి. అక్కడినుండి ప్రిన్సిపాల్ రూం సరిగ్గా ఇరవై అడుగులు. మనం దిగేవైపు అద్దాల కిటికీ ఉంటుంది. ఆ

కిటికీ పగులగొట్టుకుంటూ ఒకరు లోపలికి దూకాలి. మరొకరు గేట్ లోపలున్న వాడిపైన దూకాలి. ఈ రెండూ సరిగ్గా ఒకేసారి జరగాలి. ఏది కొంచెం ఆలస్యమైనా జరిగే ప్రమాదం మరింత తీవ్రమవుతుంది. క్రిందికి దూకడం నీకు కష్టం కాబట్టి ప్రిన్సిపాల్ రూంలోకి నువ్వెళ్ళాలి. ఓకె ?"

రషీద్ మాటలు హరీశ్‌లో ఎక్కడలేని ఆత్మవిశ్వాసాన్ని, ఉత్సాహాన్ని నింపాయి. "ఓకె ! డన్" అంటూ బొటనవేలెత్తి చూపించాడు.

"భారత్ మాతాకీ జై !" ఇద్దరి గుండెల్లో నుండి ఒకేసారి ఆర్ద్రంగా బయటికొచ్చింది నినాదం. మరుక్షణం సింహాల్లా లంఘించారు ఇద్దరూ.

ఇద్దరూ బాల్కానీలోకి చేరగానే ఏక్....దో....తీన్...... మనసులోనే కౌంట్ చేసుకుని ఒకేసారి దూకేశారు.

కాని, శరీరం సహకరించని హరీశ్, రషీద్‌తో సమానమైన వేగాన్ని అందుకోలేకపోయాడు. పర్యవసానం......ప్రిన్సిపాల్ రూంలోని టెర్రరిస్టుకి అలర్ట్ అయ్యే అవకాశం చిక్కింది.

హరీశ్ ప్రిన్సిపాల్ రూం కిటికీ అద్దం పగలగొడుతూండగానే టెర్రరిస్టు విచక్షణా రహితంగా అతనివైపు కాల్పులు జరిపాడు.

తన భర్త ఇలాంటి సాహసమేదో చేయవచ్చని ముందుగానే ఊహించి అప్రమత్తంగా ఉన్న శ్రీవాణి పక్కనే ఉన్న స్కూల్‌బెల్ కొట్టే బలమైన ఇనుపకడ్డీతో తన బలమంతా ఉపయోగించి ఆ దుండగుడి తలపై మోదింది.

ఆ ఉన్మాది కూలిపోతూ చేతిలోని మిషన్ గన్‌ని ఆమెవైపు తిప్పాడు. ఒక తూటా ఆమె వీపులోంచి దూసుకుపోయింది.

అదేమి పట్టించుకోకుండా ప్రిన్సిపాల్ గది దాటి భర్త పడిపోయిన చోటికి పరుగెత్తుకొచ్చింది శ్రీవాణి

రక్తం మడుగులో హరీశ్.

"హరీ........" భర్త తలను తన ఒడిలోకి తీసుకుంది.

"శ్రీ.........." కళ్ళనిండా ప్రేమతో ఆర్ద్రంగా పిలిచాడు.

ఇద్దరి పెదాలు ఒకేసారి కదిలాయి – "ఐ.....లవ్.....యూ...!"

ఆ మాటలు వింటున్న భరతమాత పులకించిపోయింది.

**(2002, దీపావళి ప్రత్యేక సంచిక, 'జాగృతి' వారపత్రిక)**